

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

ధాన్యం తూకం వేయడం లేదని

రైతుల నిరసన

గన్నేరువరం, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): కొనుగోలు కేంద్రంలో వడ్ల ధాన్యాన్ని తూకం వేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని పీచుపల్లి గ్రామంలో రైతులు రోడ్డుపై బైఠాయించి బుధవారం నిరసన తెలి పారు. గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేం ద్రంలో కొద్ది రోజులుగా ధాన్యాన్ని తూకం వేయకుండా తమను ఇబ్బందు లకు గురి చేస్తున్నారని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుక వస్తే నిర్వాహకులు కొర్రీలు పెడుతు న్నారన్నారు. విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు, ఏవో కిరణ్మయి, సివిల్ సప్లయిస్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ నరేందర్ రెడ్డి గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. గ్రామంలోని రైతులు పండించిన ధాన్యం వేరే రకాలవి కావ డంతో మిల్లర్లు తీసుకోవడానికి అభ్యం తరం తెలిపారని, అందుకే తూకం వేయడాన్ని ఆపామని సెంటర్ నిర్వాహకులు, అధికారులు రైతులకు వివరించారు. ధాన్యాన్ని 'బి' గ్రేడ్ రకం కింద తూకం వేయడానికి రైతులు ఒప్పుకోవడంతో తూకాలు ప్రారంభిస్తామని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తెలిపారు. దీంతో రైతులు ధర్నా విరమించారు.

విద్యుత్ ఉద్యోగులకు

పాత పద్ధతిలో పెన్షన్ ఇవ్వాలి

- తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సాయిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

గణేశ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులకు పాత పద్ధతిలో పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సాయిబాబు డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రెగ్యులేషన్స్ ప్రకటించాలన్నారు. అపరిష్కృత సమస్యలను సాధించడం కోసం సమ్మెకైన సిద్ధమని తెలిపారు. ఉచిత డిస్కం నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ అధ్యక్షుడు ఆకుల వీరయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, కార్య నిర్వాహక అధ్యక్షుడు కంటె రాజేందర్, డిస్కం అధ్యక్షుడు రఘునందన్, డిస్కం కార్యదర్శి సాల్వాజి వెంకట రమణరావు, నిర్వాహణ అధ్యక్షుడు బొమ్మ సత్తిరెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు అరీఫుద్దీన్, అదనపు కార్యదర్శి, సీహెచ్ భాస్కర్, ప్రాంతీయ కార్యదర్శి కె నర్సింగరావు, ప్రాంతీయ కార్య నిర్వహక అధ్యక్షుడు ఎస్‌వీ రమణారెడ్డి, టీజీఎన్‌పీడీసీఎల్ మేక రమేష్‌బాబు, డీఈలు జై రాజం, తిరుపతి, లక్ష్మారెడ్డి, ఎస్ఏవో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో ప్రాంతీయ అధ్యక్షుడిగా టి మహేందర్‌రావు ఎన్నికయ్యారు. ప్రాంతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా టి రాములు, ప్రాంతీయ కార్యదర్శిగా రంగు వెంకటనారాయణ, ప్రాంతీయ అదనపు కార్యదర్శిగా కన్నం నర్సింగరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డిస్కం కార్యదర్శి సాల్వాజి వెంకటరమణరావు తెలిపారు.

గజ.. గజ..

- పెరుగుతున్న చలి తీవ్రత
- వారం రోజుల్లో మరింత తగ్గనున్న ఉష్ణోగ్రతలు



కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. చలికాలం ప్రారంభంలోనే చలి తీవ్రమవుతోంది. నవంబరు రెండో వారంలోనే ఇలా ఉంటే డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో చలితీవ్రత అధికంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాతావరణం పొడిగా, ఆకాశం నిర్మలంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని, ఉత్తర, ఈశాన్య దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తుండడంతో చలి ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పటికి సాయంత్రం, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతోంది. కరీంనగర్‌లో బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15కు పడిపోయాయి. వచ్చే వారంరోజులపాటుకనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని, దీంతో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

చలి తీవ్రత పెరుగుతుండడంతో జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులతో కూడిన సీజనల్ ఫ్లూ వ్యాప్తి చెందుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శ్వాసకోస సంబంధిత, గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. గర్భిణులు, ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, 65 సంవత్సరాలుపైన ఉన్న వృద్ధులు, రక్తహీనత, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్నవారు రాత్రి వేళల్లో అవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దంటున్నారు. ప్రతిరోజు ఉదయం కాచి వడబోసిన గోరువెచ్చని నీటిని తీసుకోవడంతోపాటు వేడి ఆహారాన్ని తీసుకోవాలని, చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. రెండు, మూడు రోజులుగా . ఉదయం కొన్ని ప్రాంతాల్లో మంచు కురుస్తుండడంతోపాటి చలి తీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం 6 గంటలనుంచి చలి క్రమేపి

(మిగతా 8వ పేజీలో)



జమ్మికుంట మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం

రూ. ఏడు వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర ఏడు వేల రూపాయలు పలికింది. బుధవారం 95 మంది రైతులు 776 క్వింటాళ విడి పత్తి, 12మంది రైతులు 19 క్వింటాళ్ల గోనె సంచుల్లో తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర ఏడు వేలు, కనిష్ఠ ధర 5,500 రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 40 మంది రైతుల నుంచి 437 క్వింటాళ్ల పత్తి కొన్నది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, మార్కెట్ కార్యదర్శి రాజా పత్తి కొనుగోళ్లను పరిశీలించారు.

ఐడియా.. అదిరింది..

- కోతుల బెడదకు చింపాంజీ వేషధారణతో చెక్



చింపాంజీ వేషధారణలో భిక్షపతి

సైదాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలోని ఓ హోటల్ వద్ద బుధవారం గ్రామస్థులు రోజువారిలాగే టీ తాగుతున్నారు. ఇంతలో ఒక్కసారిగా అక్కడి చింపాంజి భయాందోళనలకు గురయ్యారు. కాస్త పరీక్షగా చూస్తే ఓ మనిషే చింపాంజి వేషం ధరించి వచ్చాడని గుర్తించారు. దగ్గరికి వెళ్లి చూస్తే అతడు ఆ హోటల్ యజమాని భిక్షపతి తెలుసుకున్నారు. ఇలా ఎందుకు చేశావని భిక్షపతిని అడగడంతో కోతులను తరిమేందుకు ఇలా చింపాంజి వేషం వేయాల్సి వచ్చిందని తెలిపాడు. సైదాపూర్‌లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. అవి భిక్షపతి హోటల్‌లోకి ప్రవేశించి సామగ్రిని చిందర వందర చేస్తున్నాయి. ఇటీవల చింపాంజి వేషధారణలో ఉండే వారిని చూసి కోతులు భయపడుతున్నాయని పత్రికల్లో చూశాడు. హైదరాబాద్ నుంచి చింపాంజి వేషధారణ దుస్తుల కిట్టు తీసుకువచ్చాడు. తానే చింపాంజిగా మారి కోతులను తరిమి కొట్టాడు. చింపాంజి వేషధారణలో ఉన్న భిక్షపతిని చూసి కోతులు పరుగందుకున్నాయి. వాటిని చాలా దూరం తరిమికొట్టిన తర్వాత భిక్షపతి తన వేషం తీసివేశాడు. ఈ ఐడియా బాగుందని గ్రామస్థులు భిక్షపతిని అభినందించారు.

పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రిజర్వు బ్యాంకు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో పలు అంశాలపై డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు, ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకునే అంశంపై వారికి అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 7,821.19 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకుగాను 3,239.73 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో 1,761.41 కోట్లు, విద్యారుణాలకు 9.7 కోట్లు, హౌసింగ్ లోన్స్‌కు 99.89 కోట్లు, మహిళా సంఘాలకు 614.36 కోట్లు, ఇతర రంగాలకు 2చ096.10 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. అర్హులైన రైతులందరికి రుణాలు మంజూరు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో సెప్టెంబరు 30 వరకు 58.22 శాతం పూర్త యిందని, పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలు బ్యాంకర్లు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ పథకాల్లో రుణాలు మంజూరైన లబ్ధిదారులు, స్వయం సమాయక సంఘాలు సకాలంలో రుణాలనుచెల్లించేలా ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రధానమంత్రి స్వానిధి, పీఎంఈజీపీ పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అను గుణంగా అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు 'మీ డబ్బు మీ హక్కు' నినాదంతో క్లైయి మ్ చేయని ఆస్తుల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. పౌరులు తమ క్లెయిమ్ చేయని బ్యాంకు డిపా జిట్లు, బీమా ఆదాయాలు, మొదలైనవి ఉంటే వాటిని క్లెయిమ్ చేసుకోవాలని సూచించారు. జీరో బ్యాలెన్సు ఖాతాలు, ఇతర పొదుపు బ్యాంకు ఖాతాలు ఉన్న వారు వారి ఖాతాలను ఆధార్ కార్డు, పాన్‌కార్డు వివరాలు బ్యాంకులో ఇచ్చి కేవైసీ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, ఎల్‌డీఎం ఆంజనేయులు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీధర్, ఆర్‌బీఐ అధికారి శ్రీనివాస్, నాబార్డు డీడీఎం జయప్రకాశ్, ఎస్‌బీఐ ఏజీఎం వెంకటేశ్, టీజీబీఆర్ఎం బాలనాగు, డీడబ్ల్యూవో సరస్వతి, మెప్మా పీడీ సునిత పాల్గొన్నారు.

అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- కేవీకే ప్రధాన కార్యదర్శి విజయ్‌గోపాల్‌రెడ్డి

జమ్మికుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో)కు ఉన్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకో వాలని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన కార్యదర్శి విజయ్‌గోపాల్‌రెడ్డి సూచించారు. జమ్మికుంట కేవీకేలో రైతు ప్రగతి ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం రెండో వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో సభ్యత్వం పొందిన ప్రతి రైతుకు స్మార్ట్ కార్డు అందించాలన్నారు. ఈ కార్డు డిజిటల్ మార్కెటింగ్ చేసి లాభాలు పొందాలని, సంస్థ అభివృద్ధిలో సంఘ సభ్యులు అందరు భాగస్వాములు కావాలని తెలిపారు. ఏడీఏ సునిత మాట్లాడుతూ ఎఫ్‌పీవోలో ప్రస్తుతం ఉన్న ఇన్‌పుట్ బిజినెస్‌తోపాటు అవుట్‌పుట్ బిజినెస్ చేసి లాభాలు పొందాలని సూచించారు. ఏవో ఖాదర్‌హుస్సేన్ మాట్లాడుతూ ఎఫ్‌పీవోలో ఉన్న రైతులందరికీ రబీ సీజన్‌లో ఎరువులు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు ప్రగతి చైర్మన్ నంద మహేందర్, కార్యనిర్వాహణాధికారి సాగర్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎస్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీపీవో జగదీశ్వర్

గంగాధర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో పన్నుల వసూళ్ల వేగవంతం చేయాలని డీపీవో జగదీశ్వర్ కార్యదర్శులను ఆదేశించారు. గంగాధర ఎంపీడీవో కార్యాలయంలో మండల కార్యదర్శులు, మండలాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో అనుకున్న పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని తప్పకుండా చేరాలని అన్నారు. పంచాయతీల అభివృద్ధిలో పన్నుల వసూళ్ల కీలకం కావడంతో వంద శాతం పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈసందర్భంగా వంద శాతానికి చేరువలో ఎన్ని గ్రామాలున్నాయని, మిగతా గ్రామాల కార్యదర్శులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పర్మిషన్ల దరఖాస్తులను క్షణ్ణంగా పరిశీలించి, అన్ని పత్రాలు సమర్పించాకనే అనుమతులు జారీ చేయాలన్నారు. పర్మిషన్లు ఇవ్వడంతో ఆలస్యం చేయెుద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాము, మండలాధికారులు పాల్గొన్నారు.

రహదారి ఇలా .. ప్రయాణించేది ఎలా?

- గుంతల మయంగా తిమ్మాపూర్ రోడ్డు
- ప్రయాణికుల అవస్థలు



తిమ్మాపూర్ వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంతలు

తిమ్మాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహ దారి నుంచి తిమ్మాపూర్ మండల కేంద్రానికి వెళ్లే రహ దారి అధ్వానంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణిం చేందుకు వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతుతు న్నారు. ఇటీ వల కురిసిన వర్షాలకు రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నది. తిమ్మా పూర్ మండల కేంద్రానికి వెళ్లేందుకు సుభాష్‌నగర్ నుంచి మరో రోడ్డు ఉంది. ఆ రోడ్డు పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. తిమ్మాపూర్ గ్రా మంలో కూరగాయలు ఎక్కువగా పండి స్తారు. ప్రతి రోజు ఉదయం తిమ్మాపూర్ నుంచి రైతులు పండించిన కూరగాయ లను కరీంనగర్ మార్కెట్‌కు ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో తరలిస్తూ ఉంటారు. ఈ రోడ్డులో ఆటోలు, కార్లు, స్కూల్ బ స్సులు వెళుతుంటాయి. ఈ రహదారి అంతా గుంతల మయం కావడంతో ప్రమా దాలు జరుగు తున్నాయి. రోడ్డును విస్త రించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అధికా రులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డును విస్తరించాలని ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు.

నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక

రాజీవ్ రహదారికి అనుకుని తిమ్మాపూర్ గ్రామంలోనికి 1.5 కిలో మిటర్ వరకు డబుల్ రోడ్డు నిర్మా ణానికి రెండు కోట్ల రూపాయలు మంజురయ్యాయి. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లలో సుభాష్ నగర్ మీదుగా తిమ్మాపూర్ గ్రామంలోకి వెళ్లే రహదారికి కిలోమీటర్ బీటీ రోడ్డు మరమతులకు 18 లక్షలు, తిమ్మాపూర్ నుంచి పోరండ్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణా నికి 80 లక్షల నిధులు మంజురుకు ప్రభు త్వానికి నివేదిక పంపించామని అధికా రులు తెలిపారు.



అధ్వానంగా ఉన్న సుభాష్‌నగర్ నుంచి తిమ్మాపూర్ వెళ్లే మార్గం

మరమ్మతులు చేయించండి

- మాతంగి శంకర్, తిమ్మాపూర్ గ్రామస్థుడు



తిమ్మాపూర్ గ్రామంలోకి వచ్చే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాజీవ్ రహదారిపైకి రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

పనులు త్వరలో ప్రారంభిస్తాం..

- సురేందర్ రెడ్డి, ఏఈ, పంచాయితీ రాజ్ శాఖ



తిమ్మాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనలుఉ త్వరలో ప్రారంభిస్తాం. సుభాష్‌నగర్- తిమ్మాపూర్, తిమ్మాపూర్- పోరండ్లకు వెళ్లే రోడ్లు వర్షానికి దెబ్బతిన్నాయి. మండలంలో దెబ్బతిన్న రోడ్ల మరమతులకు నాలుగు కోట్ల రూపాయల నిధుల ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. గట్టుదుద్దనపల్లి- పర్లపల్లి, వచ్చునూర్- జుగుండ్ల హ్యామ్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదించాము. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

రైస్ మిల్ ఆపరేటర్స్‌కు

రూ. 26 వేల వేతనం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల శంకర్

జమ్మికుంట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్ ఆపరేటర్స్‌కు కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం జమ్మికుంటలో ఆయన మాట్లాడుతూ పీఎఫ్ ఈఎస్ఐ, ప్రమాద భీమా సదుపాయాలు అన్ని రకాల కార్మికులకు అమలు చేయాలన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

● భార్యకు తీవ్ర గాయాలు


ఆవుల రవి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆవుల రవి(42) దుర్మరణం చెందాడు. అతని భార్య సంతోషినికి తలకు గాయాలయ్యాయి. త్రీటౌన్ సీఐ జి జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేశవాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఆవుల రవి కరీంనగర్‌లోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భార్య సంతోషిణితో కలిసి మోటార్‌సైకిల్‌పై కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా వైపునకు వెళ్తున్నారు. రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న కారును డ్రైవర్ హటాత్తుగా రోడ్డుపైకి రావటంతో వీరి బైక్‌ను కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆవుల రవి కుడిపక్కకు, ఆయన భార్య సంతోషిణి ఎడమ పక్కకు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో అదేదారిలో ఒక ట్యాంకర్ అతివేగంగా వచ్చి రవిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడు రవి అక్కడికక్కడే మృతి చెందాడు. సంతోషిణి తలకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. మృతుడు రవికి కొడుకు రిత్విక్, కూతురు హాసిని ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

బావిలో దూకి విద్యార్థి ఆత్మహత్య


విశ్వతేజ్(ఫైల్)

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకి ఓ విద్యార్థి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే పెద్దపల్లి పట్టణంలోని భూంనగర్‌కు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప సురేందర్‌ల ఏకైక కుమారుడు విశ్వతేజ్(17) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన విశ్వతేజ్ సాయంత్రం వరకు స్నేహితులతో గడిపాడు. అనంతరం బంధంపల్లి వద్ద రాజీవ్‌రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఫోన్లు చేసి తెలుసుకునే ప్రయత్నం చేశారు. బుధవారం ఉదయం బంధంపల్లి బావి వద్ద సెల్ ఫోన్, చెప్పులు కనిపించడంతో తల్లిదండ్రులకు సమాచారం అందింది. దీంతో జాలర్లను పిలిపించి బావి అంతా వెతికించారు. సుమారు గంట పాటు వెతకగా మృతదేహం లభించింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు దిక్సూచి.. అంబేద్కర్ స్టడీ సర్కిల్

● నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ
● ఇప్పటి వరకు ఉద్యోగాలు సాధించిన 286 మంది అభ్యర్థులు



కరీంనగర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్


స్టడీ సర్కిల్‌లో విద్యార్థులు

గణేశ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ రంగాల్లో ఎన్నిక అవకాశాలున్నా ప్రభుత్వ ఉద్యోగాలకున్న విలువ ఎప్పటికీ తగ్గదు. అందుకే వందల్లో ఉద్యోగాలుంటే లక్షల్లో దరఖాస్తులు వస్తుంటాయి. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం కష్టపడి చదువుతున్నారు. అటువంటి వారికి మార్గ నిర్దేశం చేస్తూ అవసరమైన శిక్షణ అందిస్తోంది ఎస్సీ స్టడీ సర్కిల్. ప్రైవేట్ సంస్థల్లో లక్షలు పెట్టి చదవలేని వారికి అండగా నిలుస్తోంది. 2016 సంవత్సరంలో కరీంనగర్‌లో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటైంది. ఇక్కడ శిక్షణ తీసుకున్న 286 మంది అభ్యర్థులు ఉద్యోగాలను సాధించారు.

● అర్హత.. శిక్షణ.. సౌకర్యాలు

కనీసం డిగ్రీ పాసై వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయల లోపు ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులు tsstudycircle.co.in అనే వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనపరచిన వంద మందికి ఐదు నెలలపాటు ఉచిత శిక్షణను అందిస్తారు. ఫౌండేషన్ కోర్స్ పేరున ఇస్తున్న ఈ శిక్షణలో పలు నోటిఫికేషన్ల సిలబస్‌ను కవర్ చేసే విధంగా నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తారు. ఉచిత శిక్షణ, ఉచిత భోజన వసతి ఉంటుంది. ఇతర అలవెన్స్‌ల కింద పుస్తకాల కొనుగోలుకు ఒక్కరికి 2500 రూపాయలు ఇస్తారు. నోట్‌బుక్స్, బౌండెడ్ మెటీరియల్ ఉచితంగా ఇస్తారు. ఇప్పటి వరకు రెసిడెన్షియల్ విధానంలో 10 బ్యాచ్‌లలో 918 మందికి, నాన్ రెసిడెన్షియల్ విధానం లో 2 బ్యాచ్‌లలో 264 మందికి శిక్షణ ఇచ్చారు. మొత్తం 12 బ్యాచ్‌లలో 1,182 మంది శిక్షణ పొందగా వారిలో ఇప్పటి వరకు 286 మంది ఉద్యోగాలను సాధించారు. మరో 16 మంది ఉద్యోగాలకు ఎన్నికయ్యారు. వారికి నియామకపత్రాలు రావాల్సి ఉంది.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

-బండ శ్రీనివాస్, అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్



విద్యార్థులు డిగ్రీ కనీస అర్హతతో వ్రాయడానికి వీలైన అన్ని పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నాం. ఆడియో, వీడియోల బోధన ఉంటుంది. మోడల్ టెస్టులు నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్నాం. ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

శిక్షణ చాలా ఉపయోగపడింది..

- గొల్లపల్లి రాజు, డిప్యూటీ తహసీల్దార్



డబ్బులు చెల్లించి కోచింగ్ తీసుకునే పరిస్థితి లేని సమయంలో కరీంనగర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఇచ్చిన కోచింగ్ నాకు చాలా ఉపయోగ పడింది. ఐదు నెలల శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. మాకు ఇచ్చిన కోచింగ్, మెటీరియల్ చాలా ఉపయోగపడింది.

నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నారు..

- బి ధనుంజయ్, సూపరింటెండెంట్, పీవీ నరసింహరావు వెటర్నరీ యూనివర్సిటీ



అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నారు. ఇక్కడ కోచింగ్ తీసుకున్న తర్వాతే ఉద్యోగం సాధించగలనని నమ్మకం కలిగింది. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న వారు ఇక్కడ కోచింగ్ తీసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చు.

టిప్పర్ ఢీకొని గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామశివారులో టిప్పర్ ఢీకొని తొమ్మిది గొర్రెలు అక్కడిక్కడే మృతిచెందాయి. మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. బుధవారం పెగడపల్లి శివారులోని శ్రీమల్లి కార్జున ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ టిప్పర్ గొర్రెలను ఢీకొంది. ఇందులో తొమ్మిది గొర్రెలు మృతిచెందగా, రెండు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్ వస్తున్న టిప్పర్ రోడ్డు దాటుతున్న గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని యజమాని పల్లపు మల్లయ్య పేర్కొన్నాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతకుంటపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒక గేదె మృతి చెందింది. బుధవారం గ్రామానికి చెందిన లింగంపల్లి కొమురయ్య గేదె మేతకు వెళ్లగా అక్కడ నీటిలో ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభానికి తాకి విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతు కొమురయ్య విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కోల్‌సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కనకం గణేష్‌పై మంగళవారం రాత్రి దాడికి పాల్పడిన నల్లగషాల రంజిత్, అతని భార్య లతపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని వన్‌టౌన్-2 సీఐ రవీందర్ తెలిపారు. కనకం గణేష్ మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా అదే కాలనీకి చెందిన రంజిత్ తనను ఇంటి వద్ద దింపాలని కోరాడు. అతన్ని ఇంటి వద్ద దింపిన తరువాత తనపై ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ కులం పేరుతో దూషిస్తూ కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని, అతని భార్యను కత్తి తీసుకురా అని పురమాయించినట్టు తెలిపారు. గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంజిత్, అతని భార్య లతపై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

లంచం అడిగారా... 1064కు కాల్ చేయండి

● 10 నెలల్లో 22 కేసులు, 35 మంది అరెస్టు ● ఉమ్మడి కరీంనగర్ ఏసీబీ డీఎస్‌పీ విజయ్ కుమార్



కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విధిగా చేయాల్సిన పనికోసం ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే వెంటనే ధైర్యంగా అవినీతి నిరోధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఉమ్మడి కరీంనగర్ ఏసీబీ డీఎస్‌పీ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సమాజంలో అవినీతి ఒక పెద్ద సమస్యగా మారిందన్నారు. ఆ అవినీతి జాడ్యాన్ని అరికట్టే శక్తి మన చేతుల్లోనే ఉందన్నారు. లంచం అడగడం నేరమని, లంచం తీసుకోవడం కూడా నేరమని, లంచం ఇవ్వడం కూడా నేరమని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, పౌరులకు సేవలు అందించాల్సిన ఉద్యోగి విధులను మరచి అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే భయపడకుండా వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఏసీబీ పోలీసులకు నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి పేరు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు అవినీతిపై చైతన్యవంతులై తిరగబడితేనే అవినీతి రహిత తెలంగాణ సాధ్యమన్నారు. సత్యం కోసం, మన కర్తవ్యం కోసం, అవినీతి రహిత తెలంగాణ కోసం సంకల్పంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2025 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు లంచం డబ్బులు తీసుకుంటుండగా ఇప్పటి వరకు 22 కేసుల్లో 35 మంది ఉద్యోగులు, వారి సహాయకులను అరెస్టు చేసి జైలుకు తరలించామన్నారు. ఇందులో రెవెన్యూశాఖకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులు, పంచాయతీ రాజ్ శాఖ-6, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ- 3, ఖజానా శాఖ 3, మున్సిపల్-3, వ్యవసాయశాఖ-3, డ్రగ్ కంట్రోల్-3, ఆర్‌టీఏ-3, పోలీసుశాఖలో ఒక కేసు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తిచెంది, మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన జెట్టి రాజ కొమురయ్య(60) భార్య నాలుగు సంవత్సరాల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. తీవ్రమానసిక వేదనకు గురై కొడుకు సదయ్య చెంతనే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి కదంబాపూర్ శివారులో ఉన్న తమ పొలం వద్ద గల వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లి వెంటతెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని చూసిన కొడుకు వెంటనే కొమురయ్యను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం అతన్ని కరీంనగర్‌లో ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తికి చెందిన పరశురాం అనే వ్యక్తి కాలినడకతో వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో పరశురాంనకు తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

జీడీకే11ఇంక్లైన్‌లో ప్రమాదం

● ముగ్గురు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌లో బుధవారం గనిలో ప్రమాదం జరిగింది. రెండవ షిఫ్టులో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో ఎల్‌హెచ్‌డీలు నడుపుతున్న క్రమంలో వాహనం వెనుక పనులు చేస్తున్న కార్మికులు రంజిత్, శ్రీకాంత్, ప్రవీణ్‌కు అక్కడున్న కేబుల్ వైర్ బలంగా తాకినట్టు తెలిసింది. దీంతో వారు కిందపడ్డారు. శ్రీకాంత్, ప్రవీణ్‌కు స్వల్ప గాయాలు కాగా, రంజిత్‌కు బలమైన గాయాలు తగిలాయి. స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వీరికి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి నర్సయ్యపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులో గల ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఓ కార్మికుడు బుధవారం రాత్రి రాజీవ్‌రహదారి దాటుతుండగా రోడ్డుపై వెలుతున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో కార్మికుడితో పాటు ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రంగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌కు నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి తీవ్రగాయాలపాలైన సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం ఉదయం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన గంధం శంకర్ తన ఇంటి నిర్మాణంలో భాగంగా గోడలకు నీళ్లు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా మొదటి అంతస్తు నుంచి కిందపడ్డాడు. దీంతో తలకు, నడుముకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

రిటైర్డ్ ఏఎస్సై రామచంద్రం కన్నుమూత


రాంచంద్రం(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేసి, రిటైర్డ్ అయిన ఏఎస్సై మడుపు రామచంద్రం(69) బుధవారం అనారోగ్యంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రామచంద్రం అంత్యక్రియలు ఆయన స్వగ్రామం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. రాంచంద్రం మృతికి పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖకు రామచంద్రం అందించిన సేవలు మరువలేనివన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా ఆయన చేసిన కృషి ఎంతోమందికి ఆదర్శప్రాయమన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పోతరాజు విగ్రహం ధ్వంసం

ఓదెల, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లిలో బుధవారం పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్మించిన పోతరాజు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. రాత్రి మద్యం సేవించిన ఒకవ్యక్తి పొత్కపల్లి రైల్వేస్టేషన్ నుంచి వస్తూ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు తెలిసింది. ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

బహ్రెయిన్‌లో జగిత్యాల యువకుడి ఆత్మహత్య

● పుట్టిన రోజునే ఘటన
● జగిత్యాలలో మిన్నంటిన రోదనలు


జగిత్యాలలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు , కళ్యాణ్ (ఫైల్)

జగిత్యాల టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎదిగిన కొడుకు కుటుంబానికి ఆసరాగా ఉంటాడని గల్ఫ్‌కు పంపిస్తే ఏం జరిగిందో ఏమే కానీ పుట్టిన రోజునే తల్లిదండ్రులతో సంతోషంగా మాట్లాడిన ఆ యువకుడు ఆతహత్య చేసుకుని ఆ కుటుంబంలో విషాదం నింపాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టాకా సంధిలో ఉంటున్న అనుమల్ల శంకర్ ఓ కలర్స్ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తుండగా ఆయన భార్య లావాణ్య ఆశ వర్కర్‌గా పని చేస్తున్నారు. వారికి కల్యాణ్ (26)కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఎదిగిన కొడుకును గల్ఫ్‌కు పంపితే నాలుగు రూపాయలు సంపాదించి ఇంటికి చేదోడుగా ఉంటాడని 10 నెలల క్రితం కల్యాణ్‌ను బహ్రెయిన్ దేశానికి పంపించారు. అక్కడ ఓ సర్వీసింగ్ సెంటర్లో పనిచేస్తూ ప్రతి నెలా ఇంటికి డబ్బులు పంపించేవాడు. మంగళవారం రోజున కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా కుటుంబ సభ్యులతో కూడా చాలా సంతోషంగా మాట్లాడాడు. రాత్రి ఏం జరిగిందో ఏమోకానీ ఉదయం చూసేసరికి తన గది వద్ద కల్యాణ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని కల్యాణ్ స్నేహితులు జగిత్యాలలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో ఆ కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. తన కొడుకుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ఎప్పుడు తమతో సంతోషంగానే మాట్లాడేవాడని బర్త్‌డే సందర్భంగా కూడా మాతో ఫోన్‌లో సంతోషంగానే మాట్లాడాడని అంతలోనే ఏం జరిగిందో అంతుపట్టడం లేదని యువకుడి తండ్రి రోదిస్తూ తెలిపాడు. ఆత్మహత్యకు కారణాలు తెలుసుకొని మృతదేహాన్ని త్వరగా తెప్పించే ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

వెల్గటూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో బుధవారం ఓ యువకుడు ఎనగందుల పోచయ్య అనే వృద్ధుడిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సంత కావడంతో పోచయ్య సంత నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో శాఖాపూర్‌కు చెందిన యువకుడు బైక్‌పై వెళ్లుతూ వృద్ధుడిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వృద్ధుడు కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోచయ్యను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ట్రాలీ బోల్తా.. తప్పిన ప్రాణాపాయం


రోడ్డుపై పడిపోయిన ఫైబర్ కర్రలు

వెల్గటూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం రాజక్కపల్లి వద్ద రాష్ట్ర రహదారిపై బుధవారం ట్రాలీ బోల్తా పడగా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ గోషామహల్ నుంచి ఫైబర్ లోడ్‌తో లక్షెట్టిపేట వైపు వస్తున్న ట్రాలీ రాజక్కపల్లి సమీపంలో టైరు పేలడంతో రాష్ట్ర రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాలీ ఉన్న ఫైబర్ కర్రలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయాయి. దీనితో రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అదే గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ స్పందించి స్థానిక యువకుల సహాయంతో కర్రలను తొలగించారు. కాగా ట్రాలీ వెనుక ముందు ఎలాంటి వాహనాలు రాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఏఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

భక్తుల దారి దోపిడీ

● బంగారు పుస్తెల తాడు, నగదు లాక్కెళ్లిన అగంతకుడు



వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి ఆటోలో వెళుతున్న భక్తులను లక్ష్యంగా చేసుకున్న అగంతకుడు వెంబడించి బుధవారం దారి దోపిడీకి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దేవుపల్లి బూదవ్వ, చంద్రయ్య అనే వృద్ధ దంపతులు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకొని నాంపల్లికి వెళుతున్నారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి నాంపల్లి దేవాలయానికి వెళ్లేందుకు భక్తులు ఆటోలో ఎక్కగా మార్గమధ్యలో ఒక వ్యక్తి, మరోచోట ఇంకో వ్యక్తి ఎక్కారు. నాంపల్లి కమాన్ వద్ద భక్తులు దిగగానే అగంతకుడు దిగి వారిని వెంబడించి నడుచుకుంటూ వెళుతున్న దంపతులను చంపుతానని బెదిరించి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, రూ. 2వేల నగదు లాక్కొని పరారయ్యాడు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


హర్షిత్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువ కుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పోతిరెడ్డిపేటకు చెందిన నందిపేట హర్షిత్(18), అతడి బంధువు త్రివేష్ ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్ వైపు వెళ్తున్నారు. సిర్సపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీంది. ఈ ప్రమాదంలో హర్షిత్, త్రినేష్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నందిపేట హర్షిత్ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

యైటింక్లయిన్ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలోని భాస్కర్‌రావు నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్(42) బుధవారం ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయం త్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో బెడ్‌రూంలో చీరతో సీలింగ్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాడిచర్ల ఓసీపీలో బ్లాస్టింగ్ సెక్షన్‌లో ప్రైవేట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పెళ్లిరోజు బుధవారం కావడం తో కుటుంబంలో విషాదం నింపింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్ మృతికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

16న ఉమ్మడి జిల్లాస్థాయి
జూనియర్స్ ఖో-ఖో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్స్ ఖో-ఖో పోటీలను ఈ నెల 16న కోరుట్లలో నిర్వహించనున్నట్లు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు తెలిపారు. కోరుట్ల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 9:30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో కరీంనగర్ నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు, జగిత్యాల నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు, సిరిసిల్ల నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచే జట్లకు నగదు బహుమతులతోపాటు ప్రతిభచాటే క్రీడకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. బాలబాలికల ఎత్తు, వయస్సు, బరువు మొత్తం కలిసి 250 పాయింట్లు దాటకూడదని పేర్కొన్నారు. పోటీలను లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నామని తెలిపారు. ఇతర వివరాలకు పోటీల నిర్వాహక కార్యదర్శి వి.నవీన్‌కుమార్ 8341136941 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పత్రికలు చదవడం పెరగాలి
- ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకుని పత్రికలు చదవాలని ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమల సత్యం అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కమిషన్ పెంచాలని అన్నారు. రాష్ట్ర కోశాధికారి ఉప్పు రాజేందర్, రాష్ట్ర ఆర్గనైజర్ కార్య దర్శి రణం రవీందర్‌గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కురికాల ప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పోచపల్లి రాజు ఉన్నారు.

- అర్ధరాత్రి తర్వాతనే ప్రధాన ద్వారం మూసివేత
- ముందస్తు సమాచారం లేకపోవడంతో భక్తుల ఆందోళన
- భీమేశ్వరాలయంలోనే భక్తులకు దర్శనం, ఆర్జిత సేవలు
- ఎల్ఈడీ తెరపై రాజన్న దర్శనం
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు



ఎల్ఈడి తెరపై రాజన్నను దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



పోలీసు పహారాలో దక్షిణభాగం ప్రధాన ద్వారం

రాజన్న దర్శనాల నిలిపివేత

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో స్వామివారి దర్శనాలను బుధవారం తెల్లవారుజామున ముందస్తు సమాచారం లేకుండానే నిలిపివేశారు. భక్తులు ఆలయంలోకి రాకుండా తూర్పువైపున ఉన్న రాజగోపురం దక్షిణం వైపున్న ప్రధాన ద్వారం గేటును మూసివేసి ఇనుప రేకులతో ఫెన్సింగ్ చేశారు. ఆలయం చుట్టూ ఇప్పటికే పడమర, ఉత్తరం వైపు ఎత్తయిన రేకులతో ఫెన్సింగ్ చేసి రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా నెలరోజుల నుంచి కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దక్షిణం, ఉత్తర భాగాల్లో ఉన్న ప్రాకారం, పడమర వైపున్న నైవేద్యశాల, ఈవో కార్యాలయం, తూర్పు భాగంలోని కళాభవన్‌లను ఇప్పటికే తొలగించారు. చివరికి మెయిన్ గేట్‌ను ఇనుప రేకులతో మూసివేశారు. కోడె మొక్కులు, ఆర్జిత సేవలు భీమేశ్వరాలయంలో జరుగుతాయని పేర్కొంటూ ప్రధాన ద్వారానికి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దర్శనాల నిలిపివేత పనులను ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్యల సమక్షంలోనే రాత్రంతా ఇంజ నీరింగ్ అధికారులు పూర్తిచేశారు. దీంతో సుప్రభాత దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ గేటు వద్దనే టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు పడమర వైపున్న శివుడి విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి దీపాలు వెలిగించారు. ముందస్తు సమాచారం లేకుండా ఆలయంలో దర్శనాలను నిలిపివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. భీమేశ్వ రాలయంలో సకల ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రమాదేవి ప్రకటించారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. ఆలయంలో ముందస్తు సమాచారం లేకుండా దర్శనాలను నిలిపివేయడాన్ని బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ తీవ్రంగా ఖండించారు.

భీమేశ్వరాలయంలోనే భక్తులకు దర్శనం..

భక్తులు ఇకనుంచి భీమేశ్వరాలయంలో దర్శన ఏర్పాట్లు చేశారు. అన్ని రకాల ఆర్జిత సేవలు, పూజలు భీమేశ్వరాలయంలో చెల్లించేలా ఏర్పాట్లుచేశారు. ఆలయ అభివృద్ధి పనుల దృష్ట్యా రావిచెట్టు వైపు ఏర్పాటుచేసిన ప్రచార రథంలో రాజరాజేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అక్కడే ఎల్ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. గతనెల 20న శృంగేరి పిఠాధిపతి శ్రీవిధుశేఖర భారతితో దీనిని ప్రారంభించారు. ఇకనుంచి ఎల్ఈడీ స్ర్కీన్‌లో స్వామివారిని దర్శించుకోవచ్చు.

అభివృద్ధిలో భాగంగానే రాజన్న దర్శనాలకు తాత్కాలిక ఏర్పాట్లు

• ఆలయ ఈవో రమాదేవి

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగానే స్వామివారి దర్శనాలకు తాత్కాలిక ఏర్పాట్లుచేశామని ఈవో ఎల్. రమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ విస్తరణ పనులు వేగవంతం అయినందున భక్తులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నదని గుర్తించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శృంగేరి పిఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ఆజ్ఞానుసారం భక్తుల సౌకర్యార్థం ఆలయ రాజగోపురం ఎదురుగా తూర్పువైపు స్వామివారు, అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలైన అభిషేకాలు, అన్నపూజలు, అర్చనలు, కల్యాణాలు ఏర్పాటు చేశామన్నారు. ఇకనుంచి భీమేశ్వరాలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకోవాలన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలాజీ అనే విద్యార్థి జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీలు శాతవాహన వర్సిటీ పరిధిలో జరిగాయన్నారు. డిసెంబర్‌లో జరగబోయే జాతీయ ఇంటర్ యూనివర్సిటీ ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీలు కురుక్షేత్ర విశ్వవిద్యాలయం హర్యానా రాష్ట్రంలో జరుగుతాయని, ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ అశోక్, కళాశాల అధ్యాపకులు, సహచర విద్యార్థులు బాలాజీని అభినందించారు.

వచన కవిత పోటీల్లో విద్యార్థి ప్రతిభ



రాహుల్

ధర్మారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని నర్సింహులపల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అలిశెట్టి రాహుల్ సత్తాచాటాడు. వచన కవిత, పద్య కవిత, కథ, పుస్తకసమీక్ష, చిత్రలేఖనం అంశాలలో పోటీల నిర్వహించగా రెండు రాష్ట్రాల నుంచి 1200మంది విద్యార్థులు పోస్టు ద్వారా తమ రచనలను పంపారు. న్యాయ నిర్ణేతలు బుధవారం విజేతలను ప్రకటించగా వచన కవిత విభాగంలో రాహుల్ రాసిన 'పెన్ను' కవితకు తృతీయబహుమతి లభించింది. ఈ నెల23న, హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సారస్వత పరిషత్తు భవనంలో జరిగే సమావేశంలో రాహుల్‌కు 1000రూపాయల నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించనున్నారు. రాహుల్‌ను ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయక్, ఉపాధ్యాయులున్నారు.

ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ మైనార్టీ గురుకుల ఉపాధ్యాయ సంఘం (టెమ్రిస్) ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యదర్శి భూపేందర్‌కౌర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముల్కల కుమార్, కేఏ్ జావేద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒల్లాల శ్రీనివాస్ (కరీంనగర్), ప్రధాన కార్యదర్శిగా షేక్ బాబా, ఉపాధ్యక్షులుగా రెవోజు స్వామి, అనిత, కోశాధికారిగా జి.సంధ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా నిజాముద్దీన్, ఎం.శ్రావణి, కార్యదర్శులుగా కె.శ్రావణి, క్రాంతికుమార్, జి.సుచరిత, ఎన్.హరికృష్ణ, కె.చిరంజీవి, జి.శ్రీకాంత్, డి.శ్రీలత, సంయుక్త, సాహిత్య, డి.వినోద, ఎ.హరీష్, ఎ.శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైనార్టీ గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని వారు కోరారు.

పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం

- 17న హైదరాబాద్‌లో మహాధర్నా
- 'రేవా' రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి



కరపత్రం ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం చేపట్టినట్లు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి తెలిపారు. బుధవారం నగరంలోని ప్రైవేట్ కళాశాలలో రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వరాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నరకాలంగా ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదని ఆవేదన చెందారు. బకాయిలు అందకపోవడంతో పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని అన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతుందని, విధిలేని పరిస్థితిలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టాల్సి వస్తోందని అన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పెన్షనర్ల మహాధర్నా నిర్వహించనున్నట్లు అనంతరం మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకెశాల ప్రభాకర్‌రావు, కోశాధికారి కనపర్తి దివాకర్, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ సుధాకర్, పాలోజు రవీందర్ పాల్గొన్నారు.

పరమ పవిత్రం కార్తీక దీపం



ధర్మపురి గోదావరి నది వద్ద హారతి ఇస్తున్న అర్చకులు, మహిళలు

ధర్మపురి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం పరమ పవిత్రమని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 22వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌శర్మ భక్తులను ఉద్దేశించి ధార్మిక ప్రసంగం చేశారు. కార్తీక మాసంలో నెల రోజుల పాటు దీపాలు వెలిగించడం ఎంతో శ్రేష్ఠమని అన్నారు. అనంతరం రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చారు. మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఉన్నారు.


జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



అక్షిత్‌రెడ్డి, సిద్దు

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ బాలుర జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని వాలీబాల్ అకాడమీకి చెందిన విద్యార్థులు అక్షిత్‌రెడ్డి, సిద్దు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అండర్-19 విభాగం వాలీబాల్ పోటీల్లో సిరిసిల్ల వాలీబాల్ అకాడమికి చెందిన అక్షిత్‌రెడ్డి, సిద్దు తమ క్రీడా ప్రతిభతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం సిరిసిల్లలో వీరిని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధానకార్యదర్శి అజ్మీరా రాందాస్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, కోశాధికారి కోడం శ్రీనివాస్, గుడ్ల రవి, అకాడమి శిక్షకులు సంపత్, జగన్ అభినందించారు.

రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపిక



రామంచ సహస్ర

ముత్తారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన రామంచ సహస్ర రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికైంది. రాజేశం-వాణి దంపతుల కుమార్తె సహస్ర రామగుండంలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. అండర్ 14 పోటీల్లో జిల్లాస్థాయి 400మీటర్ల రన్నింగ్ పోటీల్లో 2వ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సహస్రను ఉపాధ్యాయబృందం, తల్లితండ్రులు అభినందించారు.

ప్రచార రథం వద్ద రాజన్న దర్శనం



పనులు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి వచ్చిన భక్తులు బుధవారం స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో తూర్పుద్వారం ఎదురుగా ప్రచార రథం వద్ద ఏర్పరిచిన ఎల్ఈడీ ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు ఆలయ ఇవో రమాదేవి పలు సూచనలు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటుచేశారు. క్యూలైన్ ద్వారా భక్తులు ప్రచార రథం వద్దకు చేరుకొని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయం వద్ద బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. సాముహిక దీపాలంకరణకు హాజరైన సుహాసీనులకు వాయినాన్ని ఏఈవో శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, నరాల రాజులు పాల్గొన్నారు.

• పనులు పర్యవేక్షించిన ప్రభుత్వ విప్

రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న ఆలయ విస్తరణ పనులను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యవేక్షించారు. భవనాల కూల్చివేత, శిథిలాల తొలగింపు తదితర పనులను పరిశీలించారు. శిథిలాల తొలగింపు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రచార రథం వద్ద ఎల్ఈడీలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఆర్డీవో రాధాబాయి, ఈవో రమాదేవి, ఏఎస్పీ చంద్రయ్య, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఆర్అండ్‌బీ డీఈ అచ్చయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రిశ్విత('రశ్మిత' కాదు)

ఇల్లంతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మామిండ్ల రిశ్విత రాష్ట్రస్థాయి హామర్‌త్రో పోటీలకు ఎంపికయింది. కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో అండర్ 17 విభాగంలో రిశ్విత ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. ఈ నెల 15నుంచి హైద్రాబాద్‌లోని జింఖానా స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననుంది. విద్యార్థి ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు దూస రఘుపతి, వ్యాయామ ఉపాధ్యాయుడు సాబీర్‌లతో పాటు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన తాటిపల్లి గురుకుల, బాలికల పాఠశాల విద్యార్థులు

మల్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నీరజ, పీడీ అంజయ్య తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో లాస్య, చంద్రకళ అనే విద్యార్థినీలు మూడువేల మీటర్ల రేస్, డిస్కస్‌త్రోలో సిల్వర్, బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే నూకపల్లిలో గల ప్రతిభ స్కూల్‌కు చెందిన హనుమాన్ అనే విద్యార్థి 600మీటర్ల రేస్‌లో వెండి పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని కరస్పాండెంట్ అమీర్ తెలిపారు. ఈ నెల 14 నుంచి నాలుగు రోజుల పాటు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురకుల పాఠశాలకు చెందిన జరాఫతీమా, మనీషా అనే విద్యార్థినిలు కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనున్నారు.



బాలికల పాఠశాల విద్యార్థులు

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

మల్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో మల్యాల మండల కేంద్రంకు చెందిన రాచర్ల చిన్నమ్మ అనే వృద్దురాలి కాలుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స కోసం మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి తీసుకెళ్లగా గాయాలు తీవ్రంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే మండలంలో ఇటీవల కోతుల బెడద అధికమవగా జనాలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని పూర్తి స్థాయిలో వైద్యంకు సంబంధించి వ్యాక్సిన్ ఇతరాత్రా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో ఉంచాలని మాజీ ఎంపీటీసీ రమేశ్ వైద్యాధికారులను కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ త్రీటౌన్ పరిధిలో పోగొట్టుకున్న 20 సెల్‌ఫోన్‌లను బుధవారం టౌన్ ఏసీపీ వెంకటస్వామి యజమానులకు అప్పగించారు. ఆయా సందర్భాల్లో బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫోన్‌లను రికవరీ చేసిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ చందన

చందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ మర్రిపల్లి చందన అన్నారు. చందుర్తి మండలం మరిగడ్డ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, సనుగుల గ్రామంలోని గంగిరెద్దుల కాలనీని సందర్శించారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, ఆడపిల్లకు 18 ఏళ్లు, మగ పిల్లాడికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు గృహహింస పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే 14 ఏళ్లలోపు చిన్నారులను పాఠశాలలకు పంపించాలని చెప్పారు. మధ్యలో చదువు మానిన విద్యార్థులను గుర్తిస్తే వెంటనే పాఠశాలలో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్, ఐసిడిఎస్ సిడిపిఓ సుచరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, డిస్ట్రిక్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కవిత, డిసిపిఓ అంజి పాల్గొన్నారు.

గణితంలో రేపాక విద్యార్థిని ఉత్తమ ప్రతిభ



వర్షిణి

ఇల్లంతకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డు వర్షిణి గణితంలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథమటిక్స్ టాలెంట్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న పోటీలలో తృతీయస్థానంలో నిలిచింది. ఉన్నత విద్యకోసం కార్పోరేట్ కళాశాలలు హస్టల్‌తో పాటు ఉచితంగా విద్యను అందించడానికి ముందకు వచ్చినట్లు విద్యార్థిని తండ్రి రాజు తెలిపారు. ఈసందర్భంగా వర్షిణీకి మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు రేవతి, గణిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్, పాఠశాల కమిటీ చైర్మన్ లీలలతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఇల్లందకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. మండలంలోని చిన్నకోమటిపల్లి శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు, వారి వద్ద రూ.18,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

గజ..గజ

(5వ పేజీ తరువాయి)

పెరుగుతోంది. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 6 గంటల వరకు మంచుకురుస్తుండడంతో రాత్రి వేళల్లో రోడ్లపై రద్దీ తగ్గిపోయింది. చలి తీవ్రత పెరుగుతుండడంతో చలిని తట్టుకునేందుకు ప్రజలు ఉన్ని దుస్తులను ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

● ఉన్ని వస్త్రాలకు గిరాకీ

చలి తీవ్రత అధికమవుతుండడంతో ఉన్ని వస్త్రాలకు గిరాకీ పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని పలు చోట్ల వ్యాపారులు ఏర్పాటు చేసిన ఉన్ని వస్త్రాలను నగరవాసులు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈయేడాది 10 నుంచి 15 శాతం రేట్లు పెంచి అమ్ముతున్నారని వినియోగదారులు చెబుతున్నారు.

ఘనంగా సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి

గంగాధర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై వంశీకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలని, ఆ దిశగా ముందుకు సాగాలని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

శంకరపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధికలాభాలు సాధించవచ్చని హార్టికల్చర్ అధికారి రవళి అన్నారు. బుధవారం శంకరపట్నం మండలం మెట్‌పల్లి, గద్దపాక, తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని గ్రామాల్లో రైతులకు ఆయిల్ పామ్‌పై అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ రైతులకు భావితరాల పంటగా పేర్కొన్నారు. హెచ్‌ఈవో క్రాంతి, ఫీల్డ్ ఆఫీసర్ సూర్య, ప్రీతిపాల్‌సింగ్, లత, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌యూ ప్రొఫెసర్‌కు జీవిత సాఫల్య పురస్కారం

గణేశ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, తెలంగాణ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల్లో ఉర్దూ పరిశోధనలో ప్రతిభ చూపిన ప్రొఫెసర్లకు బహుమతులు ప్రదానం చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయ ఉర్దూ విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ నజీముద్దీన్ మునవర్ ఉర్దూలో చేసిన పరిశోధనలకు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. బుధవారం రవీంద్ర భారతిలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

మానకొండూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన కె. అనిల్ ఎంపిక అయ్యాడు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ - 19 పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయిన అనిల్‌ను అధ్యాపక బృందం అభినందించారు.

విద్యుత్ శాఖలో పనులను త్వరగా పూర్తి చేయాలి

గణేశ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనులను త్వరగతిన పూర్తి చేయాలని, వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించాలని సిబ్బందికి ఎస్‌ఈ రమేష్‌బాబు సూచించారు. బుధవారం కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఫీడర్ల ఇంట్రప్షన్, డీటీఆర్, లైన్ వర్క్స్ తొందరగా పూర్తిచేయాలన్నారు. డీఈలు రాజం, లక్ష్మారెడ్డి, చంద్రమౌళి, తిరుపతి, ఎస్ఏవో, రాజేంద్రప్రసాద్, ఏడీఈలు శ్రీనివాస్ అంజయ్య, కిరణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, లావణ్య, పంజాల శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, శ్రీనివాసు, ఏఈలు పాల్గొన్నారు.

అభివృద్ధివైపే ప్రజల మొగ్గు

కరీంనగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, సీఎం రేవంత్‌రెడ్డి పనితీరుపై జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు మొగ్గుచూపారని కాంగ్రెస్ 30వ డివిజన్ అధ్యక్షుడు దొంతి గోపి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం సీఎంతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు కలిసికట్టుగా పని చేశారని తెలిపారు.

ఉషశ్రీకి డాక్టరేట్ ప్రదానం

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థపరిధిలోని కొత్తపల్లి పట్టణానికి చెందిన ఉషశ్రీ డాక్టరేట్ అందుకున్నారు. చైన్నైలోని శ్రీరామచంద్ర యూనివర్సిటీ ఉషశ్రీకి డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ ఎన్.వనితారాణి, ఎస్. వాసుదేవమూర్తి పర్యవేక్షణలో 'అసెస్‌మెంట్ ఆఫ్ హైపర్‌యూరి సిమియాఅండ్ ఇట్స్ అసోసియేషన్ విత్ నాన్- అల్కహాలిక్‌ఫాటీలివర్ డిసీసెస్ అండ్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇన్ పేషెంట్స్ విత్ టైప్-2 డయాబెటీస్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు.

మందులు, న్యూట్రీషియన్ కిట్ల అందజేత

సుభాష్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరాం జన్మదినం సందర్భంగా స్థానిక టీబీ ఆసుపత్రిలో బుధవారం పేషంట్లకు నెల రోజులకు సరిపడా మందులు, న్యూట్రీషియన్ కిట్లను అందజేశారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరాం, ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్, పూర్వ కౌన్సిల్ చైర్మన్ హన్మాండ్ల రాజిరెడ్డి, జిల్లా కేబినెట్ సెక్రెటరీ సింగిరెడ్డి వాసుదేవరెడ్డి, జిల్లాల కేబినెట్ కోశాధికారి గాలిపెల్లి వెంకట్, డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవిత ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపు సరికాదు

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్గొండ పట్టణంలో జాగృతి జనంబాటలో భాగంగా కవితకు స్వాగతం తెలిపేందుకు అభిమానులు ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను రాత్రికిరాత్రే తొలగించడం సరికాదని, ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనమని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత రెండురోజుల జాగృతి జనం బాటలో అక్కడి సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు చేపట్టిన కార్యక్రమానికి వచ్చిన స్పందన చూసి ఓర్వలేక అక్కడ ఫ్లెక్సీలు తొలగించారని ఆరోపించారు.

గిద్దె పెరుమాళ్ల ఆలయంలో సంస్కరణలు చేపట్టాలి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 9వ, 10వ డివిజన్ పరిధిలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్ గిద్దె పెరుమాళ్ల ఆలయంలో సంస్కరణలు చేపట్టాలని పలువురు బుధవారం ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియకు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం ఇచ్చినవారిలో దుంపేటి రాము, జయపాల్ రెడ్డి, సంపత్, సందీప్, రాజు, మధు, కనకరాజు, కిరణ్, సతీశ్ ఉన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు మరో అవకాశం

కరీంనగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎన్నికలు వాయిదా పడడంతో కొత్త ఓటర్ల నమోదుకు మరోసారి అవకాశం కల్పించింది ప్రభుత్వం. 18 ఏళ్ల నిండిన యువత దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2025 సెప్టెంబరు 2న స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు తుది జాబితాను అధికారులు ప్రకటించారు. అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేయగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు తీర్పుతో ఎన్నికల నిర్వహణ వాయిదా పడింది, గతేడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాను రెండు పర్యాయాలు సవరించారు. ప్రస్తుతం ఎన్నికలు వాయిదా పడడంతో మరోసారి కొత్త ఓటర్లకు అవకాశం లభించింది. ఈ నెల 15వ తేదీ వరకు ఓటరు నమోదు చేసుకుంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటేసే అవకాశాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కల్పించింది. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో యువతకు ఓటేసే అవకాశం లభించనుంది. కొత్త ఓటరు దరఖాస్తు కోసం 2025 అక్టోబరు 1 వరకు 18 సంవత్సరాలు నిండి ఉండాలి. ఆన్‌లైన్ విధానంలో ఎన్నికల వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యక్షంగా ఫారం-6 ద్వారా బీఎల్‌వోలకు దరఖాస్తు సమర్పించాలి. అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఈనెల 15వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకోవాలి. గ్రామీణ ఓటర్ల స్థానిక ఎన్నికల జాబితాల్లో చేర్చుతారు.



ఓటరు జాబితా విడుదల చేస్తున్న అధికారులు (ఫైల్)

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల్లో భాగంగా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టు ఏడీఈ లావణ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అల్కాపూరి కాలనీ, వోక్స్‌వాగన్ లైన్, నాగుల ఎల్లమ్మ టెంపుల్ ఏరియా, శ్మశాన వాటిక, జాన్ బేకరీ, వాటర్ ట్యాంక్, గిద్దెపెరుమాండ్ల టెంపుల్, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మంకమ్మతోట, పార మితస్కూల్, సిద్ధార్థ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

తిమ్మాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపల్లి ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థినులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఉచితంగా అందిస్తున్న సైకిళ్లను బుధవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు జగదీశ్వరాచారి, ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

హుజూరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి ప్రాథమిక, సెకండరీ పాఠశాలలను మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటశాల అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

నగరంలో నాకాబందీ.. విస్తృత తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కరీంనగర్ పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి నగరంలోని 14 చోట్ల నాకాబందీ నిర్వహించారు. విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. 6 చోట్ల ఔటర్ కార్డన్, 8 చోట్ల ఇన్నర్ కార్డన్ నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 34 మందిని పట్టుకున్నారు. మరో 74 మందికి ఈ-చలాన్‌లు విధించారు. సరైన ధ్రువపత్రాలు లేని 38 వాహనాలను సీజ్ చేశారు. అల్గునూర్ చౌరస్తా, బైపాస్, బొమ్మకల్ చౌరస్తా, రైల్వేస్టేషన్, రేకుర్తి చౌరస్తా, పద్మనగర్ బైపాస్‌తోపాటు గీతాభవన్, మంచిర్యాల, నాఖాచౌరస్తాలు, భగత్ నగర్‌లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాలను అరికట్టడానికి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువుల కదలికలను గుర్తించడానికి తనిఖీలు ఉపయోగపడతాయని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి తెలిపారు. వాహనదారులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 100, పోలీసు కంట్రోల్ రూమ్ నంబరు 8712670744కు సమాచారం అందించాలన్నారు. టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, రూరల్ ఏసీపీ విజయ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఖేల్ ఉత్సవ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఖేల్ ఉత్సవ్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ఖేల్ ఉత్సవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇష్టమైన క్రీడల్లో నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నిష్ణాతులైన వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఖేల్ ఉత్సవ్‌లో భాగంగా ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, నెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు భారీమెజార్టీ

కరీంనగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బ్యాంక్ ఖాతాదారులైన సభ్యులు కాంగ్రెస్ నాయకులను గెలిపించారని, చైర్మన్ ఎన్నికతో అర్బన్ బ్యాంక్ కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చిందని అన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ గెలుస్తుందని, రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికల్లోనూ ఇదే విజయ పరంపర కొనసాగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీకి మద్దతు పలికారన్నారు. ఇక్కడి నుంచి వెళ్లి జూబ్లీ హిల్స్ ఎన్నికలలో పనిచేసిన ప్రతీ నాయకుడికి, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం సహకారంతో పని చేస్తామన్నారు. ఎండీ తాజ్, అరుణ్‌కుమార్, పోచయ్య, చాంద్, రమేష్, అనిల్ కుమార్, మిరాజ్, బషీర్, భారీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

యోగా క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. ఈ నెల 9న రంగారెడ్డి జిల్లాలోని ఎస్ఎంపీ అంతర్జాతీయ పాఠశాలలో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. 83 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ పోటీల్లో ఐదుగురు స్వర్ణ పతకాలు, నలుగురు రజత పతకాలు, నలుగురు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి యోగాలో జిల్లా కీర్తిని దశాబ్దాలుగా కొనసాగించడం విశేషమన్నారు. జాతీయస్థాయిలో సైతం జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి గుంటి రామకృష్ణ, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కోశాధికారి స్వరూపచారి, కోచ్‌లు కిష్టయ్య, మల్లేశరి, ఆనంద్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



సైదాపూర్ సమ్మక్క గుట్ట వద్ద రోడ్డుపై పడి ఉన్న చెట్టు

నరికారు.. వదిలేశారు

సైదాపూర్, నవంబరు 1 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్నాబాద్-హుజూరాబాద్ ప్రధాన రహదారిలో విద్యుత్ తీగల కింద ఉన్నాయని విద్యుత్ అధికారులు చెట్లను ఇటీవల నరికారు. ఒక చెట్టు పెద్దగా ఉండడంతో రోడ్డుకు మధ్యలో పడింది. రోడ్డుకు అడ్డంగా పడిందని తెలిసినా విద్యుత్ శాఖ సిబ్బంది ఆ ఆ చెట్టును తొలగించకుండా విడిచిపెట్టి వెళ్లారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ చెట్టు వరకు రాగానే రోడ్డుకు ఒకే వైపునుంచి మాత్రమే రాక పోకలు సాగించాల్సి వస్తుంది. చెట్లు నరికిన అధికారులు వాటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్రంథాలయాలతో చైతన్యం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలతో సమాజ చైతన్యం సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. పౌరులు, విద్యార్థులు, మేధావులు, నాయకులు, అధికారులు, పాఠకులు విజయవంతం చేయాలని కోరారు. గ్రంథాలయ సెక్రెటరీ సరితతో చర్చించి షెడ్యూల్ విడుదల చేశారు. 14న ప్రారంభ వేడుక, రెండో రోజు పుస్తక ప్రదర్శన, మూడో రోజు ప్రసిద్ధ వ్యక్తుల ప్రసంగాలు, పుస్తక విరాళాల సేకరణ, నాలుగో రోజు కవి సమ్మేళనం, ఐదో రోజు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు, ఆరో రోజు మహిళలు, పిల్లలు, దివ్యాంగుల కోసం రంగోలీ, మెహంది వంటి పోటీలు, ఏడో రోజు సాక్షరసతా దినోత్సవం, ముగింపు వేడుక ఉంటాయని వివరించారు.



మదీనా కాంప్లెక్స్ ఎదుట, పొట్టి శ్రీరాములు విగ్రహం ఐలాండ్ నోపార్కింగ్ బోర్డు వద్ద నిలపిన కార్లు

నడిరోడ్డుపై దర్జాగా పార్కింగ్

నగరంలోని పలు కూడళ్లలో నడి రోడ్లపై వాహనాలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కార్లు, ఇతర వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. బుధవారం మదీనా కాంప్లెక్స్ ఎదుట, పొట్టి శ్రీరాములు విగ్రహం ఐలాండ్ నోపార్కింగ్ బోర్డు వద్ద కార్లను దర్జాగా నిలిపి ఉంచారు. సంబంధిత అధికారులు స్పందించాలని, ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నగరవాసులు కోరుతున్నారు. - ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కరీంనగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ శివారు జూబ్లీనగర్ ప్రధాన రహదరి పక్కన ఓ రైతు పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫర్మర్ పక్కనే ఎస్ఆర్ఎస్‌పీ కాలువ ద్వారా పొలాల్లోకి నీరు చేరుతుంది. ప్రస్తుతం కాలువలో ఏపుగా గడ్డి పెరగడం, కాలువ పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఆందోళనకు గురి చేస్తోంది. తరచూ మూగ జీవాలు ఇటువైపు వస్తాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



చెట్ల పొదల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

● న్యూస్‌బాక్స్

గంగాధర ఎంపీవోగా ప్రత్యూష

గంగాధర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర ఎంపీవోగా ప్రత్యూష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ప్రత్యూష ఎంపీవోగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీవోను ఎంపీడీవో రాము, సిబ్బంది సన్మానించారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

గన్నేరువరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మండల జూనియర్ పశు వైద్య అధికారి అభిషేక్ రెడ్డి, పశువైద్య అధికారులు సురేందర్ రెడ్డి, విజయ భాస్కర్, దేవరాజు, అజయ్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత

ఇల్లందకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం జడ్పీహెచ్ఎస్‌తోపాటు కేజీబీవీ, మోడల్ స్కూల్, పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ పరీక్ష ప్యాడ్లను అందజేశారు. హెచ్ఎం తస్నీన్ నజి నీన్, ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

గంగాధర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సీయర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి పదోన్నతి పొందారు. కొంత కాలంగా పని చేస్తున్న శ్రీనివాస్ రెడ్డికి సూపరిటెండెంట్ పదోన్నతితో సిద్దిపేట జిల్లా కోహెడ ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ చేశారు. శ్రీనివాస్‌రెడ్డిని డీపీవో జగదీశ్వర్, ఎంపీడీవో రాము సన్మానించారు.

బీమా చెక్కు అందజేత

గంగాధర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం చర్లపల్లి పరిధిలోని కుర్మపల్లిలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ అమిత రూ.2లక్షల బీమా చెక్కును బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామానికి చెందిన కచ్చు మహేష్(38) ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో సభ్యుడు. నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. సహజ మరణం కింద బీమా మంజూరైంది. మాజీ ఎంపీటీసీ ఓదెలు పాల్గొన్నారు.

పొగాకు రహిత యువతపై ప్రచారం

చొప్పదండి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ సూనిక స్కూల్‌లో పొగాకు రహిత యువత అనే అంశంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్యుడు రమణాకర్ మాట్లాడుతూ పొగాకు, గంజాయి, మాదక ద్రవ్యాలతో తలెత్తే అనర్థాలపై వివరించారు.

శ్రీచైతన్య అధ్యాపకురాలికి డాక్టరేట్

తిమ్మాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసీఏ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న నాగుల భానుప్రియ డాక్టరేట్ పొందినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరాన్పూర్, గ్లోకల్ యూనివర్సిటీకి చెందిన గైడ్ రాజీవ్ యాదవ్ ఆధ్వర్యంలో చేసిన పరిశోధ నలకు భానుప్రియ పీహెచ్‌డీ పూర్తి చేశారని పేర్కొన్నారు. ప్రపం చంలో వస్తున్న నూతన ఆవిష్కరణలకు అనుగుణంగా విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా మరిన్ని పరిశోధనలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా భానుప్రియను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రామ నర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శశికాంత్, ఏవో రామారావు, మీడియా ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.



అభినందిస్తున్న చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

ఫిడె వరల్డ్ కప్ చెస్ పోటీలకు అనూప్‌కు ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోవాలో నిర్వహిస్తున్న ఫిడె వరల్డ్ కప్ చెస్ పోటీలకు జిల్లాకు చెందిన కోచ్ కంకటి అనూప్‌కుమార్‌కు ఆహ్వానం అందింది. పోటీలకు వెళ్లిన అనూప్ ఇండియాకు చెందిన పలువురు గ్రాండ్ మాస్టర్లను కలుసుకొని వారితో మాట్లాడారు. ఇండియాను చాంపియన్‌గా నిలపాలని కోరుతూ వారికి ఆల్‌ది బెస్ట్ చెప్పారు. సుమారు 84 దేశాలకు చెందిన టాప్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు.



బిర్లా విద్యార్థికి సిల్వర్ మెడల్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బిర్లా స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న మాడిశెట్టి యువన్ మహదేవ్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలాసత్పతి, యోగా గురువు ఆనంద్, తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు.



సిల్వర్ మెడల్ అందుకున్న యువన్ మహదేవ్

పారిశుధ్య కార్మికులకు క్యాప్‌ల పంపిణీ

సుభాష్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు యోగా గురువు, సామాజిక కార్యకర్త మర్రి రాజేందర్ మఫ్లర్స్, మంకీ క్యాపులను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి, సుగుణ పాల్గొన్నారు.